క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బొడ్డురాయి ప్రతిష్ట



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ, చలమారెడ్డిపాలెం గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో చలమారెడ్డిపాలెంలో బొడ్డురాయి ప్రతిష్టా మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత రెండురోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో మంగళవారం బొడ్డురాయికి ప్రత్యేక పూజలు, కలశాభిషేకం, మహాదాశీర్వచనం చేశారు. సమీప గ్రామలకు చెందిన ప్రజలు పదివేలకుపైగా పాల్గొని స్వామి తీర్థప్రసాదం స్వీకరించారు.

విజ్ఞాన్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ తాజ్‌కు తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వీసీ పి.నాగభూషణ్ మంగళవారం తెలియజేసారు. డిజైన్, సిమ్యులేషన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ హై సెన్సిటివిటీ మల్టీడైరక్షనల్ ఇనెర్షియల్ సెన్సార్ అనే అంశంపై పరిశోధన చేశారని వీసీ తెలిపారు. మహ్మమద్ తాజ్ పరిశోధనలో భాగంగా మొత్తం 2 ఎస్‌సీఐ, 5 కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని వీసీ వెల్లడించారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం



రేటూరు(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పని సరిగా పాటించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. మండలంలోని రేటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుత్ను మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం ఎంఈఓ పరిశీలించారు. మారిన మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు సరిపడా భోజనాన్ని అందించాలని నిర్వాహకులను ఆయన ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పలు రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. హెచ్ఎం రసూల్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మాతృభాషా పరిరక్షణకు కృషి చేయాలి



పెదనందిపాడు: మాతృభాషా పరిరక్షణకు అందరూ నడుం బిగించాలని ఘంటసాల చైతన్య వేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భావవ్యక్తీకరణకు మాతృభాష దోహదపడుతుందని చెప్పారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు, గ్రంథాపాలకురాలు సుభాషిణి, ఉపాధ్యాయులు ఎస్.రామకృష్ణ, జూపూడి కోటేశ్వరరావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్ట్

పెదనందిపాడు: గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,830 నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లయితే స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం అందజేయాలని ఆయన ప్రజలకు తెలియజేశారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: తాగునీటి పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనుల వలన గోరంట్ల, నగరాలు ప్రాంతాలకు ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ నగర్ రిజర్వాయర్ నుంచి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద పాత లైన్ నుంచి నూతన లైన్‌కు ఇంటర్ కనెక్షన్ పనులు బుధవారం చేపట్టనున్న దృష్ట్యా సరఫరాలో ఇబ్బందులు ఉంటాయని చెప్పారు. ప్రత్యేకంగా వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. ట్యాంకర్లు కావల్సిన వారు 98499 08397కు కాల్ చేయవచ్చని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

పెదకాకానిలో మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన చేస్తుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. పథకాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. మనబడి నాడు–నేడు ఫేజ్ 2 ద్వారా పెదకాకాని మండలానికి రూ.4.17 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలనే లక్ష్యంతో రుణమాఫీ చేయడంతో పాటు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం, ప్రభుత్వమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. తొలుత విద్యాశాఖ, వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహ నిర్మాణశాఖ, ఎన్ఆర్ఈజీఎస్ టీపీ తదితర అధికారులు ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు తాగునీరు..

25 ఏళ్లుగా తాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాలకు త్వరలో తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. ఉప్పలపాడులో పక్షులకేంద్రం పక్కనే మంచినీటి చెరువు ఉండటం, వెంకటకృష్ణాపురం గ్రామంలో నీరు చిక్కగా మారి తరచూ ఫిల్టర్‌బెడ్‌లు మరమ్మతులకు గురై తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. గత పాలకులు రెండు గ్రామాల ప్రజలు తాగునీటి అవస్థలు పడుతున్నా సమస్య పరిష్కరించడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. అయితే తాను రెండు గ్రామాల ప్రజల తాగునీటి ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. గుంటూరు నగర పాలకసంస్థ నుంచి తాగునీరు సరఫరా చేసేందుకు మార్గం సుగుమమైందన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్‌ల సహకారంతో తాగునీటి సరఫరాకు తీర్మానం జరిగిందన్నారు. తక్కెళ్లపాడు ఎన్‌టీఆర్ మానస సరోవరం వెనుక ఉన్న వాటర్ స్కీం ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు పైపులైన్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల ప్రజల తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య భరోసా ఇచ్చారు. జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, తహసీల్దార్ పి.రత్నం, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుజ్జుల సుమతి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కృష్ణారెడ్డి చిరస్మరణీయుడు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

నెహ్రూనగర్: కార్పొరేటర్ తనుబుద్ది కృష్ణారెడ్డి మృతి వైఎస్సార్ సీపీకి, పేద ప్రజానీకానికి తీరని లోటని శాసన మండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో కృష్ణారెడ్డి సంస్మరణ సభ మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సభకు డీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) అధ్యక్షత వహించారు. తొలుత కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ రెడ్డిపాలెంలో కృష్ణారెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ నేతలు నూరి ఫాతిమా, సత్యనారాయణరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, అంగడి శ్రీనివాసరావు, డాక్టర్ వై.షేక్, అత్తోట జోసఫ్ పాల్గొన్నారు.

మత్తుతో విద్యార్థుల భవిత చిత్తు

ఎన్‌ఫోర్స్‌మెంటు జిల్లా సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ

చేబ్రోలు: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను వాడితే ఆరోగ్యపరంగా, భవిష్యత్తు పరంగా తీవ్రంగా నష్టపోతారని ఎన్‌ఫోర్స్‌మెంటు జిల్లా సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ అన్నారు. చేబ్రోలులోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకం నిరోధంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలో తెలిసీ తెలియక చేసిన తప్పు జీవితాన్ని బలితీసుకుంటుందన్నారు. డ్రగ్స్ వల్ల క్షణికానందం పొందినా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సర్వం కోల్పోవలసి ఉంటుందన్నారు. ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని వాటిని సాధించటానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. కళాశాల డైరక్టర్ ఎం.శ్రీనివాస్, సీహెచ్ గీత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమాజ సేవపై అవగాహన అవసరం



ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటినుంచి సమాజ సేవపై అవగాహన కలిగి ఉండాలని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం టెక్ వింగ్స్ అసోసియేషన్, యలమంచిలి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో సమాజ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డులోగల సెయింట్ ఫాస్టినస్ బాల సదన్‌లో అనాథలు, వృద్ధులకు, బాలకార్మికులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం, కందిపప్పు, నూనె తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సేవా కార్యక్రమాలపై అవగాహన మక్కువ పెంచేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, విద్యార్థులు తదితరులున్నారు.

బహుళ అంతస్తుల నిర్మాణాలకు నిబంధనలు తప్పనిసరి

కమిషనర్ కీర్తి చేకూరి



బిల్డింగ్ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో నూతన బహుళ అంతస్తు నిర్మాణాలకు లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్(ఎల్.టి.పి.)లు తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలతోనే డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం(డి.పి.ఎం.ఎస్) అప్‌లోడ్‌చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్, వికాస్ నగర్, శ్యామల నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాలను లేజర్ మెజరింగ్ మెషిన్ ద్వారా కొలతలు పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. భవన నిర్మాణదారులు కూడా ఎల్.టి.పి.లను నిబంధనలకు అనుగుణంగానే దరఖాస్తు చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా అప్ లోడ్ చేసే ఎల్.టి.పి.ల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగానే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని, లేని వాటిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడినింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలని, సచివాలయ కార్యదర్శులు పక్కగా తనిఖీ చేయాలని కోరారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరికి కేటాయింపు ఉండాలన్నారు. ఆమె వెంట సిటీ ప్లానర్ మూర్తి, ఏసీపీలు అజయ్ కుమార్, బాబూరావు పాల్గొన్నారు.

స్వర్ణ భారతినగర్‌లో ఎస్పీ పర్యటన

గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వర్ణభారతినగర్‌లో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణ భారతి నగర్ మెయిన్ రోడ్‌ లో సీసీ కెమెరాలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు, అక్కడ షాపులు వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా బ్లూ కోర్టు వాహనాన్ని, రక్షక వాహనాన్ని అక్కడ తిరుగుతూ నిరంతరం నిఘా ఉండాలని సీఐ శ్రీనివాసరావుకి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సీఐ నరసింహారావు, ఎస్పీ సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం పాలన

గుంటూరు మెడికల్ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో చట్టసభల్లో అట్టడుగు వర్గాలను గుర్తించి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఏపీ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు అన్నారు. గత పాలకులు సామాజిక న్యాయం చేస్తామని గొప్పలు చెప్పడమే తప్ప, ఏనాడూ చేయలేదన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సామాజిక న్యాయం పాటిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న గొప్ప నాయకుడు అని వెల్లడించారు. ఎమ్మెల్సీ పదవుల్లో అన్ని వర్గాలను ముఖ్యంగా వెనుకబడిన కులాలను గుర్తించి అధిక సీట్లు కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

తెలుగు నాటకరంగ మూల స్తంభాలు పుస్తకావిష్కరణ

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని త్యాగరాయ సాంస్కృతిక కేంద్రంలో అజోవిభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి ఆధ్వర్యంలో మంగళవారం రచయితలు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, వాగ్దేవు సుందర్రావు రచించిన తెలుగు నాటకరంగ మూల స్తంభాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభకు ఫౌండేషన్ ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఆచార్యులు డీఎస్ఎన్ మూర్తి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ విజయ్ భాస్కర్, వైఎస్ కృష్ణేశ్వరరావు, సర్రాజు బాల చందర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని జగనన్న తన సంక్షేమ పథకాలతో అభివృద్ధి చేస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబానికి అందజేశారు. కొర్నెపాడు గ్రామానికి చెందిన బత్తుల శిరీషకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ. లక్ష చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బాదితురాలి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా ప్రజా ఆరోగ్య పరిరక్షణకు కృషిచేస్తూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మరెందరో బాధితులకు సీఎం వైఎస్ జగన్ ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు.

శ్రీశ్రీ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పాత గుంటూరు: సమాజ మార్పుకోసం యువత శ్రీ శ్రీ సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. మంగళవారం రెడ్ బుక్ డే సందర్భంగా బ్రాడిపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి, ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 'శ్రీశ్రీ మహాప్రస్థానం సామాజిక దృక్పథం' అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సభకు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వంలో పీడించబడే ప్రజలందరూ ఏకం కావాలనే దృక్పథం ఉందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్యం ప్రజలను అభ్యుదయ మార్గం నుంచి విప్లవ మార్గం వైపు పయనింప చేసిందన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం, ఖడ్గసృష్టి గ్రంథాలు సామాజిక చైతన్యాన్ని పెంచాయన్నారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, విజ్ఞాన కేంద్రం ప్రతినిధి పాశం రామారావు, రచయిత గూడవల్లి నాగేశ్వరరావు, తాడికొండ నరసింహారావు, పి.డి.ఎస్.యు. రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, అవధానుల హరి, బి.వీరాస్వామి, సీపీఎం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చేసిన మేలు ఇంటింటికీ వివరిద్దాం

సచివాలయం కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ సదస్సులో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సచివాలయం కన్వీనర్లు, గృహసారథులకు కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వివరిద్దామని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తురకపాలెం గ్రామంలో గుంటూరు రూరల్ మండలం సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు ఏర్పాటు చేసిన ఒక్కరోజు వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న కాలంలో సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు అందరూ కలిసి సమష్టిగా రథసారథులై కృషిచేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటి వరకూ చేసిన మేలును, అందించిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తెలియజేయాలన్నారు. రోజులో ఒకసారైనా గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు వారికి కేటాయించిన పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడాలని ప్రభుత్వ పథకాలు, ఆ కుటుంబాలకు చేసిన మేలు తెలపాలని, వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత సచివాలయ సిబ్బందికి తెలియపరిచి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. జగనన్నకు ప్రతి ఒక్కరం అండగా మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆళ్ల రవిదేవరాజు, వైస్ ఎంపీపీలు ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, దర్శి సుజాత, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు డబ్బారి సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



అంకిరెడ్డిపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. 26వ డివిజన్ అంకిరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఏమైనా సమస్యలున్నాయా అంటూ గ్రామస్తులను అడిగి తెలుసుకుని, చిన్నపాటి సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారాలు చూపుతూ ముందుకు సాగారు. కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, కాకుమాను జెడ్పీటీసీ ఎంఎస్ గుల్జార్‌బేగం, అసదుల్లా, సొసైటీ చైర్మన్‌లు తంగెళ్ళ నాగేశ్వరరావు, కాశీ విశ్వనాథం, ఆర్‌అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపాల రాద, కందుకూరి జ్యోతి, పుట్టా బాజీ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రానికి శంకుస్థాపన



విజ్ఞాన కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు: తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శంకుస్థాపన చేశారు. మంగళవారం ఉదయం పెదనందిపాడు లావువారి చెరువు వద్ద జరిగిన శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పెదనందిపాడు ప్రాంతం జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించిందని, పర్వతనేని వీరయ్యచౌదరి నాయకత్వంలో పన్నుల నిరాకరణ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగిందని, నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు జరిగాయని ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండే ఈ విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక వేత్తలు దాసరి శేషగిరి రావు, అరవపల్లి కృష్ణమూర్తి, సీపీఎం నాయకులు నరిశెట్టి అచారి, కాకుమాను నాగేశ్వరరావు, కుర్రా హరిబాబు, జంపని రామారావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కాకుమాను: ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఏర్పాటు చేసినట్లు ట్రస్టు సభ్యురాలు ఆరి సత్యవతి అన్నారు. స్థానిక ప్రగతి మహిళా మండలి భవనంలో గత కొన్ని నెలలుగా మహిళలకు మగ్గం, జూట్ బ్యాగ్‌ల తయారీ, కుట్టు మిషన్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మగ్గంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ప్రతి మహిళా ఒకరిపై ఆధార పడకుండా స్వయంగా ఆర్థికాభివృద్ధి చెందాలనే లక్ష్యంతో గ్రామంలోని దాతల సహాయ సహకారాలతో మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా మగ్గం నేయడంలో ప్రతిభ కనబరచిన పలువురు మహిళలకు జూట్ బ్యాగ్‌లను అందజేశారు. త్వరలో ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌లు అందజేయనున్నట్లు సత్యవతి తెలిపారు.

ఎస్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెహ్రూనగర్: తొలి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్న డాక్టర్ కుంబా రవిబాబును ఎమ్మెల్సీగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేయటం రాష్ట్రంలోని లక్షలాది మంది గిరిజనులకు గర్వకారణమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, జిల్లా విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మొగిలి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీగా డాక్టర్ కుంభ రవిబాబు ఎంపికైన సందర్భంగా సీఎంకు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకుడు పాలపర్తి రామారావు మాట్లాడుతూ గిరిజన నాయకుడిగా డాక్టర్ రవిబాబు దశాబ్దాలుగా తమ సమస్యలపై పోరాడుతూ గిరిజనులందరినీ ఏకతాటిపై నడుపుతున్నారని చెప్పారు.

మండల సర్వసభ్య సమావేశం.. గరంగరం



మాట్లాడుతున్న కొత్త మల్లాయపాలెం సర్పంచి లక్ష్మారెడ్డి

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం మొదలయ్యింది మొదలు ముగిసే వరకు ప్రజా సమస్యలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. సర్వసభ్య సమావేశానికి సగానికి పైగా శాఖలు డుమ్మా కొట్టడంపై జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా సమావేశాలకు రాని వారిపై ఎందుకు చర్యలు తీసుకోరంటూ ఎంపీడీఓను ప్రశ్నించారు. గైర్హాజరైన అధికారులందరికీ మెమోలు జారీ చేస్తానని ఎంపీడీఓ తెలిపారు. తాగునీటి సమస్యపై వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలానీ, ప్రొటోకాల్ అమలుపై గనికపూడి ఎంపీటీసీ సురేష్ , ఆశా కార్యకర్తలు విధుల్లో నిర్లక్ష్యంపై కొత్త మల్లాయపాలెం సర్పంచి లక్ష్మారెడ్డి, కొండ జాగర్లమూడిలో తాగునీటి సమస్యలపై తుమ్మలపాలెం ఎంపీటీసీ సుభాషిణిలు అధికారులను ప్రశ్నించారు.